బీజేపీ కాంగ్రెస్ కొత్త నాటకం

ప్రజలు ఆ పార్టీలకు ఓట్లు వేయబోరని అర్థమైంది

- మతం.. రిజర్వేషన్లు అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీకి వణుకు
- ఓటుతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి: హరీశ్

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట, మే 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'జనం ఓట్లు వేసేటట్టు లేరని కాంగ్రెస్, బీజేపీ కొత్త నాటకానికి తెరతీశాయి. కాంగ్రెస్ గెలిస్తే హిందువుల భూములను ముస్లింలకు పంచుతుందని బీజేపీ వాళ్లు రెచ్చగొడుతున్నరు. బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు పోతాయని కాంగ్రెస్ అంటున్నది. రిజర్వేషన్లు పోతాయా? అంటే భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు మార్చే హక్కు ఎవ్వరికీ లేదు' అని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలోని కోమటిచెరువు వద్ద, డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడారు. పట్టణంలో పాదయాత్ర చేపట్టారు. రాత్రి చిన్నకోడూరు, నంగునూరులో నిర్వహించిన రోడ్‌షోల్లో మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భాల్లో మాట్లాడిన హరీశ్.. 'వడగండ్ల వానతో నష్టపోయిన, పంటలు ఎండిన రైతులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కేసీఆర్ గట్టిగా అడుగుతున్నడు. మా ప్రభుత్వం మీద గట్టిగా కొట్లాడుతున్నడు అని కాంగ్రెస్ వాళ్లు ఫిర్యాదు చేస్తే, కేసీఆర్ ప్రచారాన్ని రెండు రోజులు ఆపారు' అని విమర్శించారు. రెండు రోజులు ప్రచారాన్ని ఆపినా, తెలంగాణ ప్రజల గుండెల్లో మాత్రం కేసీఆర్ ఎప్పటికీ నిలిచి ఉంటారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల హృదయాల నుంచి కేసీఆర్‌ను దూరం చేయలేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. కేసీఆర్ బస్సుయాత్రతో బయలుదేరితే కాంగ్రెస్, బీజేపీ వాళ్లు గజగజ వణుకుతున్నారని, అందుకే భయంతో ప్రచారాన్ని ఆపాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 'రుణమాఫీ ఎప్పుడు చేస్తవ్? వడ్లకు బోనస్, అక్క చెల్లెలకు రూ.2,500, అవ్వా తాతలకు రూ.4 వేల పింఛను ఎందుకు ఇస్తలేవు? అని కేసీఆర్ అడిగితే.. ఈ రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నాడు? కేసీఆర్‌ను పట్టుకొని నీ చెడ్డి ఊడగొడతా అని అంటున్నడు. తెలంగాణ తెచ్చిన పెద్దాయనను పట్టుకొని అలా అనొచ్చా? ఒక సీఎం మాట్లాడే మాటలేనా? కేసీఆర్‌ను అంటే తెలంగాణ ప్రజలందర్నీ అన్నట్టు కాదా? మన గౌరవం తీసేసినట్టు కాదా? మన ఆత్మగౌరవాన్ని ఈ రేవంత్‌రెడ్డి దెబ్బ తీస్తున్నాడు. కేసీఆర్ లేకపోతే సిద్దిపేట, సిద్దిపేట లేకపోతే కేసీఆర్ ఉంటడా? తెలంగాణ తెచ్చినోడు మన కేసీఆర్. జిల్లాలు చేసిండు, సిద్దిపేటకు రైలు తెచ్చిండు. గోదావరి నీళ్లు తీసుకవచ్చి మన సిద్దిపేట పేరు ప్రఖ్యాతులు కాపాడిండు. మన కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి తిట్టుడు అంటే మనందర్నీ అవమానించినట్టే' అని వెల్లడించారు. ఓటుతోనే ఈ కాంగ్రెస్ సర్కారుకు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 'ఢిల్లీ గాడిద గుడ్డు ఇచ్చిందని చెప్తున్న రేవంత్.. నాలుగు నెలల్లో ప్రజలకు ఇచ్చిందీ గాడిద గుడ్డు తప్ప ఇంకోటి లేదు. వంద రోజుల్లో హామీలు అని మోసం చేసిండు. కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేయొద్దు. పెనం మీద నుంచి పొయ్యిలో పడే పరిస్థితి వస్తుంది. బీజేపీ గెలిస్తే ఇంకా ఆగమైతం' అని ప్రజలకు సూచించారు. ఎప్పటికైనా బీఆర్‌ఎస్సే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

సూపర్‌హిట్ యాత్రపై నిషేధాజ్ఞలు

కేసీఆర్‌కు జననీరాజనంతో కాంగ్రెస్, బీజేపీలకు ముచ్చెమటలు

- జననేత ప్రశ్నలకు జవాబు ఇవ్వలేక కుట్రలకు తెరలేపిన ఆ రెండు పార్టీలు
- సర్కార్ వైఫల్యాలను వివరిస్తున్న కేసీఆర్
- మీ వెంటే మేమున్నామన్న ప్రజలు
ప్రజల స్పందన చూసి 48 గంటలపాటు ప్రచారం నుంచి తప్పించేలా కుట్ర

మహబూబాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు చేపట్టిన రోడ్డుషోలు, బస్సుయాత్ర సూపర్‌హిట్ అయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటికే నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సాగిన కేసీఆర్ యాత్రకు జనం పోటెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమితో ఇక ఆ పార్టీ పని అయిపోయిందంటూ ప్రత్యర్థులు ప్రచారం చేశారు. అలాంటి సమయంలో కేసీఆర్ ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజలు కూడా తెలంగాణ సాధకుడికి మద్దతుగా నిలవడం గమనార్హం. 'సారు మళ్లీ మీరే రావాలి. మీ పాలనే బాగున్నది' అంటూ ఎక్కడికక్కడ యువత ప్లకార్డులు పట్టుకొని స్వాగతం పలుకుతున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు చూస్తుంటే, కేసీఆర్ బస్సుయాత్రకు ముందు.. కేసీఆర్ బస్సుయాత్ర తర్వాత అని చెప్పుకోవాల్సిన విధంగా పరిస్థితి మారింది. అంతటి స్పష్టమైన తేడా కనిపిస్తున్నది. ఇందుకు కారణం ఒకే ఒక్కడు కేసీఆర్! ఆయన చేపట్టిన బస్సుయాత్ర! కేసీఆర్ రంగప్రవేశంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణమే పూర్తిగా మారిపోయింది. కేసీఆర్ పట్ల తెలంగాణ ప్రజలకున్న తిరుగులేని విశ్వాసం, ప్రేమ, అభిమానాన్ని ఎవరూ చెరిపేయలేరని నిరూపితమైంది. కేసీఆర్ వస్తే తమ పరిస్థితి ఏమిటన్న భయం, బెణుకు కాంగ్రెస్, బీజేపీల్లో మొదలైంది. దీంతో రెండు పార్టీలు కలిసి కుట్రలకు తెరలేపాయి. ఎట్లాగైనా కేసీఆర్ గొంతు వినపడకుండా చేయాలని ప్రయత్నించాయి. ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. ఫలితమే 48 గంటల ప్రచార నిషేధం! సిరిసిల్లలో పంటలు ఎండిపోయి గోసపడుతున్న రైతులు, ఆత్మహత్యలకు పాల్పడ్డ నేతన్నల కుటుంబాల కోసం కేసీఆర్ చేపట్టిన యాత్రను ఎన్నికల ప్రచారంగా చిత్రీకరించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. వాస్తవానికి సిరిసిల్లలో కేసీఆర్ ఎన్నికలు, ఓట్లు అన్నదే మాట్లాడలేదు. కానీ, విచిత్రంగా కాంగ్రెస్ దీనిపై ఫిర్యాదు చేయడం, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం గమనార్హం.

కేసీఆర్ ప్రసంగంలో ప్రస్తావించిన ప్రధాన అంశాలు..

- రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, పంటలకు రూ.500 బోనస్ ఏమైందని పదే పదే ప్రశ్నిస్తున్నారు. బ్యాంకులు నోటీసులిస్తున్నాయని, రుణమాఫీ ఎందుకు చేయడం లేదని నిలదీస్తున్నారు. ఈ ఒక్క ప్రశ్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి మీద ఒట్టు, యాదాద్రి నరసింహస్వామి మీద ఒట్టు, రామప్ప శివుడి సాక్షిగా చెప్తున్నా.. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి చోటా చెప్పుకోవాల్సిన పరిస్థితిని కేసీఆర్ కల్పించారు. ఇది కేసీఆర్ ప్రచారం మొదలు పెట్టిన తర్వాత జరిగిన కీలక పరిణామాల్లో ప్రధానమైనది.
- గోదావరి నదిని తమిళనాడుకు తరలించే కుట్రలను మొదట కేసీఆరే బయటపెట్టారు. ఇచ్చంపల్లి ద్వారా గోదావరి నీళ్లను గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా తమిళనాడుకు తరలించే కుట్రలను సీఎం రేవంత్‌రెడ్డి ఏ మాత్రం అడ్డుకోవడం లేదని దుయ్యబట్టారు. తమిళనాడు ఓట్ల కోసం తెలంగాణ ప్రజలకు నీళ్లు రాకుండా బీజేపీ ఆడుతున్న రాజకీయ డ్రామా ప్రజలను ఆలోచింపజేస్తున్నది.
- బీజేపీకి 200 సీట్లు దాటవని కేసీఆర్ పలుసభల్లో ఘంటాపథంగా చెప్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వమే కేంద్రంలో కొలువుదీరుతుందని, కేంద్రంలో బీఆర్‌ఎస్ కీలకపాత్ర పోషిస్తుందని స్పష్టంచేస్తున్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులను కేసీఆర్ వివరించారు. ఇది ప్రజల్లో ఆలోచన రాజేసింది. జాతీయ మీడియా సైతం కేసీఆర్ చెప్పిన అంశాల ఆధారంగా ప్రత్యేక కథనాలు ఇస్తున్నది.
- 'కాంగ్రెస్ అనేక వాగ్దానాలు ఎగ్గొట్టింది. తులం బంగారం మార్కెట్ల దొరుకుతలేదా? పింఛన్లు రూ.4 వేలకు ఎందుకు పెంచుతలేరు? స్కూటీలు ఇచ్చిండ్రా? కాంగ్రెస్ ఎగవేసిన హామీల గురించి గ్రామాల్లో గీతగీయండి.. నిలదీయండి' అంటూ కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.
- తాను తెచ్చిన తెలంగాణ తన కండ్ల ముందే నాశనమవుతున్నదని పలు సభల్లో ఆవేదన వ్యక్తంచేశారు. తన ప్రాణమున్నంత వరకు తెలంగాణను అన్యాయం కానివ్వనని పదేపదే చెప్తున్నారు. కేసీఆర్ వచ్చి అన్నింటిపై కూలంకశంగా వివరించి చెప్పడంతో ప్రజల్లో ఆలోచన మొదలైంది.
- 'కరెంట్ కోతలెందుకొచ్చినయి? సాగునీళ్లు, తాగునీళ్లు ఎందుకివ్వడంలేదు? మేమున్నప్పుడు ఎలా వచ్చాయి?' అంటూ కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకావడంలేదని ప్రజలకు వివరిస్తున్నారు. నాగార్జునసాగర్ కింద గడిచిన పదేండ్లలో ఎలా నీళ్లిచ్చారో, ఇప్పుడెందుకు ఇవ్వడంలేదో రైతులకు వివరించి చెప్పడంతో ప్రజలకు బాగా అర్థమవుతున్నది.
- కేసీఆర్ బస్సుయాత్ర ఫలితంగా పలు పార్లమెంట్ స్థానాల్లో గెలిచే అవకాశాలు మెరుగుపడ్డాయి. అసలు బీఆర్‌ఎస్ పోటీలోనే ఉండదని కాంగ్రెస్, బీజేపీలు భావించగా ఏకంగా 12కు పైగా సీట్లలో బీఆర్‌ఎస్ గెలుస్తుందని సర్వే సంస్థలు నిర్ధారణకు వచ్చాయి. ఇది కాంగ్రెస్, బీజేపీ నేతలను కలవరపెట్టింది. కేసీఆర్ పర్యటనలతో తమకు ఇబ్బందేనని భావించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయించి ప్రచారాన్ని ఆపించాయి. ఆ రెండు పార్టీలకు కేసీఆర్ బస్సుయాత్ర మింగుడు పడటం లేదు.

బీజేపీ, కాంగ్రెస్‌కు కేసీఆర్ భయం: కాసాని

బడంగ్‌పేట, మే 1: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు వస్తున్న ప్రజాస్పందన చూసి కాంగ్రెస్, బీజేపీ భయపడుతున్నాయని, అందుకే 48 గంటల పాటు ఆయన ప్రచారాన్ని ఆపించాయని చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో నిర్వహించిన సమావేశానికి మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి హాజరయ్యారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనే రావాలని కోరుకుంటున్నారని వెల్లడించారు.

నిషేధం అప్రజాస్వామికం: ఎర్రోళ్ల

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై నిషేధం విధించటం అప్రజాస్వామ్యమని సీనియర్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీకి వణుకు పుట్టిందని విమర్శించారు.

మోదీ కన్వర్టెడ్ బీసీ

- ఆయనకు బీసీలపై ప్రేమ లేదు
- వీడియోలను సీఎం ఎక్కడైనా మార్ఫింగ్ చేస్తడా?
- ప్రచారంలో పాల్గొనకుండా చూసేందుకే కేసు
- బెదిరింపులకు భయపడం
- మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, కోరుట్ల, మే 1 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ బీసీ కాదని, ప్రధాని అయ్యాక ఆయన కులాన్ని బీసీలలో కలిపారని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. స్వతహాగా బీసీ కాకపోవడం వల్లనే ఆయనకు బీసీలపై ప్రేమ లేదని విమర్శించారు. ఓబీసీల ఓట్ల కోసమే ఆయన బీసీ అవతారం ఎత్తుతుంటారని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల రద్దు అంశంపై బీజేపీ అగ్రనేత అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేశారన్న అభియోగంపై తనకు నోటీసులొచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. అంతకుముందు కోరుట్లలో ఎన్నికల ప్రచారసభలో కూడా ప్రసంగించారు. తనపై కేసు పెట్టడానికి తెలంగాణలో పోలీసులు లేరా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం శాఖ ఆధీనంలో ఉంటారు కాబట్టి తనపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. తనను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చూసేందుకే కేసు పెట్టారని ఆరోపించారు. కేసులు, నోటీసులకు రేవంత్‌రెడ్డి భయపడ్డడా? అని ప్రశ్నించారు. ఢిల్లీ నుంచి ఇక్కడికి వచ్చిన పోలీసులు తమ లీగల్‌సెల్ మహిళా న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు. 'సీఎంకు ఏ పనీ ఉండదా? ఎక్కడైనా వీడియోలు మార్ఫింగ్ చేసుకుంటూ కూర్చుంటాడా? కిషన్‌రెడ్డికి అసలు బుర్రుందా? నోటికొచ్చింది మాట్లాడటమేనా?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనకు కేంద్రం నోటీసులు ఇవ్వడాన్ని తనపై వ్యక్తిగతంగా చేసిన దాడిగా భావించడం లేదని, యావత్తు తెలంగాణపై చేస్తున్న దాడిగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

తెలంగాణ గొంతుకపై ఆంక్షలు

> మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల సంఘం నోటీసులు అందజేసింది. 48 గంటల పాటు ఎన్నికల ప్రచారంపై నిషేధం విధించిన నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బుధవారం రాత్రి మహబూబాబాద్‌లో కురవి తహసీల్దార్ సునీల్‌రెడ్డి.. కేసీఆర్‌కు ఉత్తర్వుల కాపీని బస్సులోనే అందజేశారు. ఈసీ నోటీసులను గౌరవప్రదంగా స్వీకరించిన కేసీఆర్.. వెంటనే ప్రచారాన్ని ఆపేశారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి తన ప్రసంగాన్ని గడువు సమయంలోగా ముగించారు.

బీఆర్‌ఎస్ అధినేత నిబంధనలు ఉల్లంఘించారా?

కేసీఆర్‌పై ఎన్నికల సంఘం 48 గంటలపాటు ప్రచారంలో పాల్గొనవద్దంటూ నిషేధాజ్ఞలు జారీచేయడంపై చర్చ జరుగుతున్నది. వాస్తవానికి, రాజ్యాంగబద్ధ సంస్థలకు అత్యంత విలువ ఇచ్చే అతికొద్ది మంది రాజకీయ నాయకుల్లో కేసీఆర్ ఒకరు. ఆయనకు 50 ఏండ్లకుపైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నది. చట్టాలు, ఎన్నికల నిబంధనలపై సంపూర్ణమైన అవగాహన ఉన్నది. ఆయన ఎన్నడూ ఈ తరహా నిషేధానికి గురికాలేదు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు శిక్షణ ఇచ్చే సందర్భాల్లో కూడా ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలని కేసీఆర్ చెప్తుంటారు. మాటల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటారు. కేసీఆర్‌పైనే ఈసీ ఇప్పుడు చర్యలు తీసుకోవటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నది.

కాంగ్రెస్, బీజేపీ డూప్ ఫైట్

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంపై రెండు పార్టీల సరికొత్త డ్రామా!

- కేసీఆర్ ప్రచారంతో ఒక్కసారిగా మారిన సీన్
- కేంద్ర, రాష్ట్ర సర్కార్లను ఎండగడుతున్న కేసీఆర్
- 12 స్థానాల వరకు బీఆర్‌ఎస్ గెలిచే అవకాశం
- ఇప్పటికే పలు జాతీయ సర్వే సంస్థల అంచనాలు
- ప్రజాదరణను జీర్ణించుకోలేక 'ఎమోషనల్ డ్రామా'
- ప్రచారం నుంచి కేసీఆర్‌ను తప్పించే ఎత్తుగడ
- ఈసీ ద్వారా 48 గంటలపాటు ప్రచారంపై నిషేధం
- రాజకీయ కుట్రేనంటున్న రాజకీయ విశ్లేషకులు

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత నాలుగు రోజుల్లో వరుసగా జరిగిన పరిణామాలను విశ్లేషిస్తుంటే లోక్‌సభ ఎన్నికల ప్రచారక్షేత్రంలో కాంగ్రెస్, బీజేపీ మాత్రమే ఉండాలని, కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను తప్పించాలని చేసిన కుట్ర అని స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కేసీఆర్ బస్సుయాత్రతో తమ అంచనాలన్నీ తలకిందులు కావడంతో రెండు పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్, బీజేపీ కలిసి 'నువ్వు తిట్టినట్టు చెయ్యి.. నేను ఏడ్చినట్టు చేస్తా' అనే తరహాలో రాజకీయం మొదలు పెట్టాయని అంటున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ డూప్‌ఫైట్

రాష్ట్రంలో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులు కావడం, బీఆర్‌ఎస్‌కు దూరమైన వర్గాలు మళ్లీ దగ్గరవ్వడాన్ని జీర్ణించుకోలేక.. కాంగ్రెస్, బీజేపీ కలిసి కొత్త నాటకానికి తెరలేపాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 'ఉంటే నేను ఉండాలి, లేదంటే నువ్వు ఉండాలి' అని నిర్ణయించుకున్నట్టు కనబడుతున్నదని వ్యాఖ్యానిస్తున్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యలు వంటివి ప్రస్తావిస్తే తమకు మొదటికే మోసం వస్తుందని గ్రహించి, ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టేలా 'డూప్‌ఫైట్'తో ఎమోషనల్ డ్రామా మొదలు పెట్టాయని విశ్లేషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందంటూ బీజేపీ ప్రచారం మొదలుపెడితే, తనను పదవి నుంచి దింపే కుట్ర చేస్తున్నారంటూ రేవంత్‌రెడ్డి సానుభూతి పొందే వ్యాఖ్యలు చేశారని గుర్తుచేస్తున్నారు. ఆ తర్వాత రామాలయం నిర్మించామని బీజేపీ ప్రచారం చేస్తే, 'రాముడికి మొక్కాలి, బీజేపీని తొక్కాలి' అంటూ కాంగ్రెస్ కొత్త రాగం ఎత్తుకున్నదని వివరిస్తున్నారు. రాష్ట్రంలో ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, ఆర్జీ ట్యాక్స్, ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపణలు చేస్తుంటే, తెలంగాణకు మోదీ గాడిదగుడ్డు ఇచ్చారంటూ రేవంత్‌రెడ్డి విమర్శిస్తున్నారని ఉదహరిస్తున్నారు. అయినా ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించకపోవడంతో ఫేక్/మార్ఫింగ్ వీడియోల నాటకం తెరమీదికి తెచ్చారని అంటున్నారు. ఫేక్ వీడియోలను టీపీసీసీ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, కేంద్ర హోం శాఖ ఫిర్యాదు చేయడంతో ఢిల్లీ పోలీసులు తెలంగాణకు వచ్చి రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చి వెళ్లారు. దీంతో ఈ అంశాన్ని గుజరాత్ అహంకారానికీ, తెలంగాణ పౌరుషానికి మధ్య పోరాటంగా అభివర్ణిస్తూ సెంటిమెంట్‌ను రగిల్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి, మైనార్టీ రిజర్వేషన్ల రద్దు అంశంపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బీజేపీ నాయకునిగా చేసినవే తప్ప కేంద్ర హోంశాఖ మంత్రి హోదాలో అధికారికంగా చేసినవి కావు. కానీ, అమిత్‌షా వ్యాఖ్యలను మార్ఫింగ్ చేశారంటూ కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేయడం, వారు హైదరాబాద్‌కు వచ్చి రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేయడం పెద్ద డ్రామా అని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ స్వయంగా ఆరోపణలు చేస్తే, బీజేపీ వస్తే రిజర్వేషన్ రద్దు చేస్తుందని రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని అంటున్నారు.

కేసీఆర్‌ను దూరం చేసేలా కుట్ర

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై తాము మాత్రమే ఉండాలని, ప్రజలు తమ గురించి మాత్రమే ఆలోచించాలని బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేసిన ప్రయత్నాలు విజయం సాధించలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందుకు కేసీఆరే ప్రధాన కారణమని అంటున్నారు. కేసీఆర్ తన యాత్రలో మొత్తం ప్రజా సమస్యల గురించి మాత్రమే ప్రస్తావిస్తున్నారని గుర్తుచేస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు, రైతుబంధు రాకపోవడం, ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడం, విద్యుత్తు సరఫరాలో ఆటంకాలు, కాలువలకు సాగునీటి విడుదలలో నిర్లక్ష్యం వంటి ప్రజా సమస్యలపైనే కేసీఆర్ ఫోకస్ చేస్తున్నారు. ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఎలా దోఖా చేసిందో ప్రజలకు వివరిస్తున్నారు. ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయాలను సైతం ఎండగడుతున్నారు. మోదీ ఇచ్చే పెద్ద పెద్ద నినాదాలు మాటలకే తప్ప, ఆచరణలో కనిపించడం లేదని ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో ప్రజలు ఆలోచించడం మొదలు పెట్టారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను ఎన్నికల ప్రచారం నుంచి దూరం చేసేందుకు రెండు పార్టీలు కుట్ర పన్నాయని విశ్లేషిస్తున్నారు. రైతుభరోసా యాత్రలో భాగంగా సిరిసిల్లలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను అడ్డం పెట్టుకొని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా.. ఎన్నికల సంఘం 48 గంటల నిషేధం విధించిందని అంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలతో పోల్చితే కేసీఆర్ వ్యాఖ్యల తీవ్రత చాలా తక్కువని అంటున్నారు. కాంగ్రెస్ గెలిస్తే దేశ సంపదను ముస్లింలకు పంచి పెడతారనే అర్థం వచ్చేలా మోదీ వ్యాఖ్యానించారని గుర్తుచేస్తున్నారు. ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్తున్నారు. 1987లో శివసేన అధినేత, దివంగత బాల్‌ఠాక్రే ఒక ప్రచారసభలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించారంటూ ఆరేండ్లపాటు ఎన్నికల ప్రచారానికి దూరం చేయడంతోపాటు ఓటు వేయకుండా నిషేధం విధించిందని రాజకీయ విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. కానీ, ఇప్పుడు మోదీపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్తున్నారు. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి అనేకసార్లు కేసీఆర్‌ను ఉద్దేశించి 'పేగులు మెడలో వేసుకుంటా', 'గుడ్లు పీకేస్తా' వంటి అనేక వ్యాఖ్యలు చేసినా వినపడనట్టు ఈసీ ప్రవర్తిస్తున్నదని మండిపడుతున్నారు. కానీ, కేసీఆర్‌పై మాత్రం కక్ష కట్టినట్టుగా చర్యలు తీసుకున్నారని, దీని వెనుక కాంగ్రెస్, బీజేపీ గూడుపుఠాణీ ఉన్నదని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి, కేసీఆర్ సిరిసిల్ల పర్యటన ఎన్నికల ప్రచారం కోసం కాకుండా, పంటలు ఎండిపోయిన రైతులకు భరోసా కల్పించేందుకు చేపట్టారు. ఒక సందర్భంలో మీడియా ప్రతినిధులు ఎన్నికల గురించి ప్రశ్నలు అడుగగా 'నేను ఇక్కడికి ఎన్నికల ప్రచారం కోసం రాలేదు. తర్వాత మాట్లాడుతాను' అని కేసీఆర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేస్తున్నారు. బస్సుయాత్రలో భాగంగా ఇప్పటివరకు కేసీఆర్ ఏడు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల 'కేసీఆర్ రాకముందు.. కేసీఆర్ ప్రచారం తర్వాత' అనే స్థాయిలో స్పష్టంగా ప్రజలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారనే టాక్ వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో యాత్ర కీలక దశకు చేరుకున్న దశలో కేసీఆర్‌ను ప్రచారపర్వానికి దూరం చేసేందుకే నిషేధం పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేసీఆర్ రాకతో పరిస్థితి తలకిందులు

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవడంతో ఆ పార్టీ పనైపోయిందని కాంగ్రెస్, బీజేపీ భావించాయి. అధికారంలో ఉన్నాం కాబట్టి తమకు ఎదురులేదని కాంగ్రెస్ అనుకోగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ స్థానాన్ని తాము ఆక్రమిస్తామని బీజేపీ ఆశలు పెంచుకున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఎదురు ఉండదని, చెరికొన్ని సీట్లు పంచుకోవచ్చని లెక్కలేసుకున్నాయి. కానీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బయటకు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. 'ఉద్యమ కాలంనాటి కేసీఆర్ కనిపిస్తడు' అని ప్రకటించి, దానికి తగ్గట్టుగానే పక్కా ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు. కేసీఆర్ ఎక్కడికి వెళ్లినా ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలుకుతున్నారు. రైతులు, మైనార్టీలు, మహిళలు.. ఇలా అన్ని వర్గాలూ తిరిగి బీఆర్‌ఎస్ వైపు చూడటం మొదలుపెట్టాయి. ముఖ్యంగా 'బీజేపీకి బీ టీమ్' అంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారాన్ని నమ్మి బీఆర్‌ఎస్‌కు దూరమైన మైనార్టీలకు.. అది దుష్ప్రచారమని అర్థం కావడంతో ఆలోచన ధోరణి స్పష్టంగా మారినట్టు కనిపిస్తున్నది. ఫలితంగా ఎన్నికల రణక్షేత్రంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో 10-12 ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలిచే పరిస్థితి కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మెజార్టీ స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు, మూడో స్థానాలకు పరిమితమవుతాయనే అంచనాలున్నాయి.

FORMAT C - 1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of the Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **KASANI GYANESHWAR KASANI SON OF LATE RAMULU KASANI RESIDENT OF H.No. 1-50, BACHUPALLY (V & M) MEDCHAL-MALKAJGIRI DISTRICT TELANGANA, PIN-500118**

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI (BRS)**

(Independent candidates should write "Independent" here)

Name of Election : **GENERAL ELECTION TO HOUSE OF PEOPLE (LOKSABHA) 2024**

*Name of the Constituency : **10-CHEVELLA PARLIAMENT CONSTITUENCY**

I KASANI GYANESHWAR KASANI a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of case (s)	Section (s) of Acts concerned and brief description of offence (s)
1	Hon'ble I Addl.Chief Judge Cum Spl. Judge for SPE & ACB cases Court at Hyderabad	FIR No. 43 of 1997 P.S. CID TS Hyderabad	CC No. 19 of 2023 Charges have not been framed	U/s 447, 420 r/w 120-B of I.P.C. It is alleged that being a public representative connived with A-3 to A-5 who are the public servants committed irregularities and malpractices in the construction and allotment of houses to economically weaker section persons.

(B) Details about cases of conviction for criminal offences

Sl. No	Name of Court & date(s) of order (s)	Description of offence (s) & punishment imposed	Maximum Punishment Imposed
01	NIL	NIL	NIL

* In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/-

(KASANI GYANESHWAR KASANI)

10-CHEVELLA PARLIAMENT CONSTITUENCY